ఆదివారం 09-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 359, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## తెలంగాణలో ఎవరికి కేబినెట్ బెర్త్..!

వివరాలు 3లో



## చిన్నారుల కోసం బాల్ జీవన్ బీమా

వివరాలు 5లో



## ఆ రోజులు గుర్తొచ్చాయి..

వివరాలు 4లో

# నేడే ప్రధాని ప్రమాణస్వీకారం

- డిల్లీలో హై అలర్ట్.. మూడంచెల భద్రత
- పలు దేశాల నుంచి అధ్యక్షులు, అతిథులు రాక
- సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో అతిధులకు విందు



**ముందడుగు జాతీయం:**

భారత దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ మూడోసారి ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. సాయంత్రం 7:30 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రధానిగా మోడీ ప్రమాణం చేయనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. మోడీచే ప్రమాణం చేయించనున్నారు. ప్రమాణస్వీకారానికి అధికారులు **మిగతా 2లో**

# లోక్‌సభ ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ

## కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ తీర్మానం



**ముందడుగు జాతీయం:**

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు తీసుకోనున్నారు. శనివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ తీర్మానం రాహుల్ గాంధీ ఎంపికను ఏకగ్రీవం చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ చేసిన ప్రచారాన్ని పార్టీ ప్రశంసించింది. సీడబ్ల్యూసీ సమేవశంలో సభ్యులందరూ రాహుల్ గాంధీని ప్రతిపక్ష నేతగా ఉండాలంటూ తీర్మానం చేసినప్పటికీ.. ఆయన మాత్రం తన నిర్ణయాన్ని వెల్లడించలేదు. అందరూ కలిసి రాహుల్‌ని ప్రతిపక్ష నేతగా ఉండాలని డిమాండ్ చేయడంతో తప్పకుండా ఆయన బాధ్యతలు తీసుకుంటారని కేసీ వేణుగోపాల్ తెలిపారు. **మిగతా 2లో**

# వందేభారత్ రైళ్ల వేగం తగ్గింది

- గంటకు 76.25 కిలోమీటర్లకు పడిపోయింది
- సాధారణ రైళ్ల వేగం కూడా తగ్గింది



**ముందడుగు జాతీయం**

దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వందే భారత్ రైళ్లకు విశేష స్పందన లభిస్తోంది. అందుకే దేశవ్యాప్తంగా వందేభారత్ రైళ్ల సంఖ్యను గణనీయంగా **మిగతా 2లో**

# అక్షర యోధుడు రామోజీరావు కన్నుమూత

- శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస
- ఫిల్మ్ సిటీలోని నివాసంలో పార్థివదేహం
- తరలివచ్చిన రాజకీయ, సినీ ప్రముఖులు

**ముందడుగు తెలంగాణ:**

ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) తుదిశ్వాస విడిచారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారు జామున 4.50 గంటలకు కన్నుమూశారు.



ఫిల్‌మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివ దేహాన్ని తరలించారు. **మిగతా 2లో**

ముందడుగు
ఆదివారం, 09-6-2024, హైదరాబాద్

# నేడే ప్రధాని ప్రమాణస్వీకారం

**మొదటిపేజీ తరువాయి**

భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీ సిద్ధమైంది. పారామిలటరీ సిబ్బంది, ఎన్ఎస్జీ కమాండోలు, డ్రోన్లతో భారీ ఏర్పాట్లు చేశారు. ఈ ప్రమాణస్వీరాకానికి విదేశీ అతిథులు రానున్న నేపథ్యంలో ఢిల్లీలో జీ 20 తరహాలో ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రమాణస్వీకారానికి ఎన్డీఏ సభ్యులతో సహా విదేశీ ప్రముఖులు రానున్నారు. ఈ నేపథ్యంలో హోటళ్ల నుంచి వేదిక వరకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆయా మార్గాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం ఢిల్లీలో హై అలర్ట్ ఉంటుంది. ఢిల్లీ పోలీసు అధికారుల సమాచారం ప్రకారం.. ఐదు కంపెనీల పారామిలటరీ సిబ్బంది, ఎన్ఎస్జీ కమాండోలు, డ్రోన్లు, స్నిపర్లతో బహుళ లేయర్ల భద్రత రాష్ట్రపతి భవన్ చుట్టూ ఉండనుంది. రాష్ట్రపతి భవన్ ప్రాంగణం లోపల, వెలుపల మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేశారు.

### భద్రతా సిబ్బంది అదుపులో హోటళ్లు

మోడీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బంగ్లాదేశ్, శ్రీలంక, మాల్దీవులు, భూటాన్, నేపాల్, మారిషస్ మరియు సీషెల్స్ అగ్రనేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఇందుకోసం నగరంలోని లీలా, తాజ్, ఐటీసీ మౌర్య, క్లారిడ్జెస్, ఒబెరాయ్ వంటి హోటళ్లు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఈ హోటళ్లను భద్రతా సిబ్బంది తమ అదుపులోకి తీసుకున్నాయి. ఆహ్వానం అందిన వారిలో శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ ముయిజు, సీషెల్స్ వైస్ ప్రెసిడెంట్ అహ్మద్ అఫీఫ్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మారిషస్ ప్రధాని ప్రవింద్ జుగ్నాథ్, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్రధాన మంత్రి షెరింగ్ టోబ్గే రానున్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆదివారం సాయంత్రం రాష్ట్రపతి భవన్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందులో నేతలు పాల్గొంటారు.

### సామాన్యులకు ప్రత్యేక ఆహ్వానం

ఈ వేడుకకు ప్రత్యేక ఆహ్వానితుల్లో సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్లో పని చేస్తున్న కార్మికులు, వందే భారత్ మరియు మెట్రో రైళ్లలో పనిచేస్తున్న రైల్వే శాఖ సిబ్బంది మరియు ఉద్యోగులు, ట్రాన్స్జెండర్లు, పబ్లిక్ హెల్త్ డిపార్ట్మెంట్ నుంచి పారిశుధ్య కార్మికులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు మరియు విక్షిత్ భారత్ అంబాసిడర్లు ఉన్నారు.

# వందేభారత్ రైళ్ల వేగం తగ్గింది

- గంటకు 76.25 కిలోమీటర్లకు పడిపోయింది
- సాధారణ రైళ్ల వేగం కూడా తగ్గింది

**మొదటిపేజీ తరువాయి**

పెంచుతున్నారు. తక్కువ సమయంలోనే సుదూర ప్రయాణాలకు వెళ్లడానికి వెసులుబాటు ఉండటంతో జనాలు కూడా వీటిని ఆదరిస్తున్నారు. అయితే వందే భారత్ రైళ్ల సంఖ్య ఎంతగా పెరుగుతుందో.. వాటి వేగం అంతలా తగ్గిపోతుందంట! గడిచిన మూడేండ్లలో వందే భారత్ రైళ్లు ప్రయాణించే వేగం గంటకు 84.48 కిలోమీటర్ల నుంచి 76.25 కిలోమీటర్లకు పడిపోయింది. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం కింద ఓ వ్యక్తి అడిగిన ప్రశ్నకు సమాధానంగా రైల్వే శాఖ వెల్లడించింది.

వందేభారత్ రైళ్లను 2019 ఫిబ్రవరి 15వ తేదీన తొలిసారిగా ప్రారంభించారు. గంటలకు 160 కిలోమీటర్ల వేగతంతో ప్రయాణించేలా వీటిని అత్యాధునిక టెక్నాలజీతో పునరుద్ధరించారు. కానీ వందేభారత్ రైళ్ల సగటు వేగం 202021లో 84.48 కిలోమీటర్లు ఉండగా.. 20222 నాటికి ఆ వేగం 81.38 కిలోమీటర్లకు, 202324 నాటికి 76.26 కిలోమీటర్లకు పడిపోయిందని రైల్వే శాఖ వెల్లడించింది. కేవలం వందే భారత్ రైళ్లు మాత్రమే కాదని, వివిధ మార్గాల్లో ట్రాక్ పునరుద్ధరణ, స్టేషన్ల నవీకరణ కారణంగా సాధారణ రైళ్ల వేగం కూడా తగ్గిందని పేర్కొంది. మధ్యప్రదేశ్కు చెందిన చంద్రశేఖర్ గౌర్ చేసిన ఆర్టీఐ దరఖాస్తుకు రైల్వే అధికారులు ఈ మేరకు సమాధానమిచ్చారు.

### లోక్సభ ప్రతిపక్ష నేతగా

# రాహుల్ గాంధీ

### కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ తీర్మానం

**మొదటిపేజీ తరువాయి**

రాహుల్ గాంధీ తాజాగా జరిగిన ఎన్నికల్లో వయనాడ్, రాయ్బరేలీ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమికి స్పష్టమైన మెజారిటీ రాకపోయినప్పటికీ.. గతంతో పోల్చితే మెరుగైన ప్రదర్శన చేసింది. 99 స్థానాలతో దేశంలో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది. 2014లో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారం కోల్పోయిన తర్వాత ప్రతిపక్ష హోదా దక్కడం ఇదే తొలిసారి. 2019 ఎన్నికల్లో 52 స్థానాలు, 2014లో 44 సీట్లు కాంగ్రెస్ పార్టీకి వచ్చాయి. పార్లమెంట్లో ప్రతిపక్ష హోదా దక్కాలంటే లోక్సభలోని మొత్తం సభ్యుల్లో కనీసం 10 శాతం మంది ఉండాలి.

# చేప ప్రసాదం పంపిణీకి భారీగా జనం

- క్యూలైన్లో నిలబడ్డ వ్యక్తి మృతి
- మైదానం ఆవరణలోనే ప్రత్యేక స్టాళ్లు

**ముందడుగు హైదరాబాద్:**

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో శనివారం చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం జరిగింది. చేప మందు కోసం క్యూలైన్లో నిలబడ్డ వ్యక్తి ఒక్కసారిగా సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు అతడిని గమనించి సపర్యలు చేసినా అతనిలో చలనం లేకపోవడంతో అక్కడే ఉన్న పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో వారు అంబులెన్స్ సమాచారం ఇచ్చి.. సీపీఆర్ చేశారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత అతన్ని కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ సదరు వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అతని మృతి పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అటు, క్యూ లైన్లో వ్యక్తి మృతితో అధికారులు అప్రమత్తమయ్యారు. క్యూలైన్లో ఎవరికైనా బాగోలేదనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని.. నిలబడిన చోటే సేద తీరాలని సూచిస్తున్నారు.

### భారీగా తరలివచ్చిన ప్రజలు

అటు, ఎగ్జిబిషన్ గ్రౌండ్లో శనివారం, ఆదివారం చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే తెలుగు రా



ష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో జనం తరలివచ్చారు. క్యూలైన్లలో నిలబడ్డ వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వాహకులు, పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఏడాది మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా బత్తిని సోదరులు.. ఆస్తమా, ఉబ్బసం, దమ్ము, దగ్గు వంటి శ్వాస సంబంధిత బాధితులకు చేప ప్రసాదం పంపిణీ చేస్తారు. బత్తిని కుటుంబం కొన్ని దశాబ్దాలుగా ఈ చేపమందు ఉచితంగా అందజేస్తోంది. బత్తిన శంకర్గౌడ్ వాళ్ల తాతకు ఓ సాధువు ఈ మందు తయారీ విధానం నేర్పించి ఉచితంగా అందజేస్తే కుటుంబానికి మేలు జరుగుతుందని చెప్పడంతో అప్పటి నుంచి ఈ చేపప్రసాదం అందిస్తున్నారు. ఇటీవలే హరినాథ్ గౌడ్ మరణించినా... ఆయన కుటుంబ సభ్యులు ఈ ఏడాది చేపమందు పంపిణీ చేయనున్నారు. అయితే, ప్రసాదం ఉచితంగా అందిస్తున్నా.. చేపలను మాత్రం ఎవరికి వారే సొంతంగా తెచ్చుకోవాల్సి ఉంటుంది. దీని కోసం మైదానం ఆవరణలోనే ప్రత్యేక స్టాళ్లు పెట్టి కొర్రమీను చేప పిల్లలను విక్రయిస్తుంటారు.

# అక్షర యోధుడు రామోజీరావు కన్నుమూత

**ముందడుగు తెలంగాణ:**

1936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ తర్వాత ఆయన జన్మించారు. కుటుంబసభ్యులు రామోజీకి.. తాతయ్య రామయ్య పేరు పెట్టారు. బడిలో మాస్టారుకు తన పేరు రామోజీరావు అని చెప్పి.. తన పేరును తనే పెట్టుకున్నారు. చిన్నప్పటి నుంచే విలక్షణ, సృజనాత్మకత ఉన్న వ్యక్తి ఆయన. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రిక నిలిచింది.

### కొత్తగా ఆలోచించడం ఆయన నైజం..

బహుముఖ ప్రజ్ఞ.. కఠోర సాధన.. ఇవే రామోజీ అస్త్రాలు. నలుగురు నడిచిన బాట కాదు.. కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరా



మంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన రామోజీరావు.. చైతన్యదీప్తుల్లాంటి చిత్ర రాజాలను సృజించారు. అద్భుత ఫిల్మ్సిటీని సృష్టించారు. తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆఖరి క్షణం వరకూ ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన ప్రాథమిక సూత్రం. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడు.

### వేల మందికి ఉపాధి అవకాశాలు..

అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ ఆయన చెరగని ముద్ర వేశారు. 1962లో మార్గదర్శి చిట్ఫండ్స్ను స్థాపించారు. దేశంలోనే అగ్రశ్రేణి చిట్ఫండ్స్ సంస్థగా మార్గదర్శి నిలిచింది . 60 ఏళ్లలో లక్షలాది మంది ఖాతాదారులకు నిబద్ధతతో సేవలు అందించారు. ఈ సంస్థ ద్వారా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించారు.

### తరలివచ్చిన రాజకీయ, సినీ ప్రముఖులు..

రామోజీరావు మరణవార్త విని దేశ వ్యాప్తంగా ఉన్న పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు తరలి వచ్చారు. సినీ రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

ముందడుగు
ఆదివారం, 09-6-2024, హైదరాబాద్

# రామోజీరావుతో మాట్లాడటం నా అదృష్టం

## రామోజీ మృతిపై మోడీ దిగ్భ్రాంతి ▪ చివరి కోరిక తీరకుండానే అస్తమించిన రామోజీరావు

**ముందడుగు హైదరాబాద్:**

తెలుగు ప్రజలందరినీ, తన అభిమానులందరినీ వదిలి ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్, రామోజీ ఫిలిం సిటీ సృష్టికర్త రామోజీరావు కానరాని లోకాలకు వెళ్లిపోయారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ఎంతో మందికి సాధ్యం కాని విజయాలను సాధ్యం చేసి చూపించిన గొప్ప ధీశాలి, పద్మ విభూషణ్ గ్రహీత, మహనీయుడు రామోజీ రావు. రామోజీరావు మృతి పట్ల ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ రామోజీ రావు మృతి పట్ల తన సంతాపాన్ని తెలియజేశారు. రామోజీ రావుగారి



మరణం ఎంతో బాధాకరం. ఆయన భారతీయ మీడియాలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన ఒక దార్శనికుడు అంటూ కితాబిచ్చారు. ఆయన సేవలు సినీ, పత్రికారంగాలలో చెరగని ముద్ర వేశాయని మోడీ అన్నారు.

### ఆయనతో మాట్లాడటం నా అదృష్టం

తన అవిరళ కృషి ద్వారా, ఆయన మీడియా, వినోద ప్రపంచాలలో శ్రేష్టమైన ఆవిష్కరణలకు నూతన ప్రమాణాలను నెలకొల్పారు రామోజీ రావు అంటూ మోడీ కొనియాడారు. రామోజీ రావు భారతదేశ అభివృద్ధి పట్ల చాలా ఉత్సాహం చూపేవారని మోడీ అన్నారు. ఆయనతో సంభాషించడానికి, ఆయన అపారమైన జ్ఞానాన్నుంచి లబ్ధి పొందేందుకు అనేక అవకాశాలు పొందడం నా అదృష్టం అంటూ ఆయన తన అభిప్రాయం వ్యక్తం చేశారు.



# తెలంగాణలో ఎవరికి కేబినెట్ బెర్త్..!

## ▪ పోటీ పడుతున్న సీనియర్ నాయకులు ▪ కసరత్తు చేస్తున్న బిజెపి అధిష్టానం

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలో బీజేపీ ఈ సారి ఎనిమిది ఎంపీ స్థానాలు గెలుచుకుంది. ఇప్పటి వరకు కిషన్ రెడ్డి మాత్రమే కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఈ సారి తెలంగాణలో రెండు నుంచి మూడు స్థానాలు దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో..రాష్ట్రం నుంచి గెలిచిన బీజేపీ ఎంపీల్లో ఆశలు పెరుగుతున్నాయి. కిషన్ రెడ్డికి మరోసారి మంత్రి పదవి ఖాయమనే చర్చ వినిపిస్తోంది. కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కరీంనగర్ లోక్‌సభ స్థానం నుంచి, ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ నుంచి రెండోసారి సిట్టింగ్ స్థానాలను నిలుపుకున్నారు.

### తొలి విడత ఇద్దరికే

మల్కాజిగిరి నుంచి బరిలో దిగిన ఈటల రాజేందర్, ఆది నుంచి భారీ ఆధిక్యంతో దూసుకెళ్లి విజయ దుందుభి మోగించారు. అలాగే చేవెళ్ల నుంచి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ స్థానం నుంచి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ గెలుపొందారు. వీరంతా రాష్ట్రానికి సంబంధించి పార్టీలో కీలకంగా ఉన్న నేతలే. వీరిలో ఒకరిద్దరు మినహా ప్రస్తుతం గెలిచిన వారందరూ సీనియర్లే కావడంతో కేంద్ర మంత్రి పదవి ఎవరిని వరిస్తాయనేది చర్చనీయాంశంగా మారింది. తొలి విడతలో ఇద్దరికే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### ఢిల్లీ నేతల తుది కసరత్తు

ఢిల్లీ నుంచి అందుతున్న సమాచారం మేరకు కిషన్ రెడ్డి.. ఈటల రాజేందర్ కు అవకాశం దక్కే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. విస్తరణ సమయంలో మరో ఇద్దరికి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే, కిషన్ రెడ్డికి ఖాయమని చెబుతున్న సమయంలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ అదే సామాజిక వర్గానికి చెందటంతో పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారుతోంది. అయితే, పార్టీ భవిష్యత్ ను పరిగణలోకి తీసుకొని నిర్ణయం ఉంటుందని ఢిల్లీ ముఖ్య నేతలు చెబుతున్నారు.

# నేషనల్ మార్ట్ ఇండియా కా హైపర్ మార్ట్ ఏడో స్టోర్ మెహిదీపట్నంలో ప్రారంభం



**ముందడుగు హైదరాబాద్:**

విశాలమైన షాపింగ్ ఏరియా, విశాలమైన పార్కింగ్ స్థలంతో మెహిదీపట్నం ప్రాంత వినియోగదారులకు సేవలందించడానికి నేషనల్ మార్ట్ వారి సరికొత్త స్టోర్ "ఇండియా కా హైపర్ మార్ట్" ఇప్పుడు ప్రారంభమైంది. మెహిదీపట్నంలోని నేషనల్ మార్ట్ కిరాణా, స్టేషనరీ, హోమ్ & కిచెన్ అప్లయెన్సెస్, కుక్ వేర్, పాదరక్షలు, పురుషులు, మహిళలు, పిల్లల కోసం దుస్తులు ఇంకా మరెన్నో ఉత్పత్తులను సరసమైన ధరలకు ఒకే చోట అందిస్తుంది.

ఆలిండియా మజ్లిస్ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ అధ్యక్షతన గ్రాండ్ లాంచ్ కార్యక్రమం జరిగింది. ఈ ప్రాంత రిటైల్ వ్యాపారాల్లో ఒక ముఖ్యమైన మైలురాయి. అద్భుతమైన, ఉత్సాహభరితమైన ప్రారంభోత్సవ కార్యక్రమం మెహిదీపట్నం వాసులకు షాపింగ్ సౌలభ్యంలో ఒక సరికొత్త శకాన్ని తెస్తుంది. అందుబాటు ధరల్లో వివిధ రకాల ఉత్పత్తులతో ప్రజలకు సేవలందించాలన్న నేషనల్ మార్ట్ అంకితభావానికి నిదర్శనమని అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మెహిదీపట్నం స్టోర్ ప్రారంభం సందర్భంగా నేషనల్ మార్ట్ వ్యవస్థాపకుడు యశ్ అగర్వాల్ మాట్లాడుతూ, "నాణ్యత, చౌకగా ఉండే బ్రాండ్ మిశ్రమాన్ని మెహిదీపట్నానికి తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉంది అన్నారు.



# కొన్ని సార్లు ప్రభుత్వాలు ఒకరోజు మాత్రమే ఉంటాయి

## • త్వరలో ఇండియా కూటమి ప్రభుత్వం వస్తోంది • మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

**ముందడుగు పశ్చిమ బెంగాల్:**

కేంద్రంలో చట్టవిరుద్ధంగా, అప్రజాస్వామ్యంగా మోడీ ప్రభుత్వం కొలువుదీరుతోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. అందుకే ప్రధాని ప్రమాణ స్వీకార కార్యక్రమంలో టీఎంసీ పాల్గొనటం లేదన్నారు. 400 సీట్లు గెలుస్తామన్న వారు కనీస మెజార్టీ మార్క్ కూడా సాధించుకోలేకపోయిందని ధ్వజమెత్తారు. కొన్ని రోజులకు ఇండియా కూటమి ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని సార్లు ప్రభుత్వాలు ఒకరోజు మాత్రమే ఉంటాయని... ఏదైనా జరిగితే.. ఎన్డీయే కూటమి ప్రభుత్వం కేవలం 15 రోజులు మాత్రమే ఉండొచ్చు? అని మమత జోస్యం చెప్పారు. రాబోయే రోజుల్లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆమె పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.

తాజా ఫలితాల్లో ఇండియా కూటమి 232 స్థానాల్లో విజయం సాధించింది. ఇక టీఎంసీ బెంగాల్‌లో 29 స్థానాల్లో గెలుపొందింది. అత్యధిక స్థానాల్లో విజయం సాధించిన నాలుగో పార్టీగా టీఎంసీ నిలిచింది. ఆదివారం ప్రధానిగా మోడీ ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఇండియా కూటమిలో బలమైన నేతగా ఉన్న సీఎం మమత చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

ముందడుగు
ఆదివారం, 09-6-2024, హైదరాబాద్

# ఆ రోజులు గుర్తొచ్చాయి..



రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ సరసన 'లైగర్'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది యంగ్ బ్యూటీ అనన్యా పాండే. ప్రస్తుతం బాలీవుడ్‌లో బాగానే రాణిస్తున్నది. తాజాగా తన టీనేజ్ రోజుల్ని గుర్తుచేసుకున్నది అనన్య. హఠాత్తుగా ఆమెకు టీనేజ్ జ్ఞాపకాలు గుర్తుకురావడానికీ ఓ కారణం ఉంది. అదే.. 'ఇన్‌సైడ్ అవుట్ 2' అనే అమెరికన్ యానిమేటెడ్ చిత్రం. కెల్సీమన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కోసం అమీ ప్లోహార్, ఫిలిస్ స్మిత్, లూయిస్ బ్లాక్, టోనీ హేల్ వంటి హాలీవుడ్ నటీనటులు వాయిస్ ఓవర్ ఇచ్చారు.

హిందీ వెర్షన్‌లో 'రిలే అండర్సన్' అనే ఓ 13 ఏళ్ల అమ్మాయి పాత్రకు అనన్యా పాండే డబ్బింగ్ చెప్పింది. ఈ సందర్భంగానే.. తన టీనేజ్ ముచ్చట్లను పంచుకున్నది అనన్య. 'పిక్సర్ అండ్ డిస్నీ స్టూడియోల యానిమేషన్ చిత్రాలకు నేను వీరాభిమానిని. ఈ సంస్థల నుంచి వస్తున్న 'ఇన్‌సైడ్ అవుట్ 2'కి పనిచేయడం నిజంగా హ్యాపీగా ఉంది. రిలే పాత్రకు వాయిస్ ఓవర్ చెబుతున్నప్పుడు.. నాకు నా టీనేజ్ గుర్తొచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది లైగర్ బ్యూటీ.

## కట్నంగా బైక్ ఇవ్వలేదని
# చిత్రహింసలు

### మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన అత్తింటివారు



**ముందడుగు ఉత్తరప్రదేశ్:**

ఒక మహిళను అత్తింటి వారు కట్నంగా బైక్ ఇవ్వనందుకు చిత్ర హింసలకు గురిచేశారు. మహిళను చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 6న అత్రౌలీ గ్రామంలో ఒక మహిళను అత్తింటి వారు దారుణంగా హింసించారు. ఆమె తండ్రి మరణించడంతో కట్నంగా బైక్ ఇవ్వలేకపోవడంపై వారు ఆగ్రహించారు. ఆ మహిళను ఇంటి నుంచి బయటకు ఈడ్చుకొచ్చారు. ఆమెను చెట్టుకు కట్టేసి దారుణంగా కొట్టారు. దీంతో ఆ మహిళ బాధతో ఏడ్చింది. గ్రామస్తులంతా దీనిని చోద్యం చూశారు. ఆ యువతిని కాపాడేందుకు ఎవరూ ముందుకురాలేదు. ఈ విషయం తెలిసిన పుట్టింటి వారు ఆ గ్రామానికి చేరుకున్నారు. మహిళను కాపాడి తమతో తీసుకెళ్లారు. అనంతరం అత్తింటి వారిపై పోలీసులకు ఆ మహిళ ఫిర్యాదు చేసింది. చనిపోయిన తండ్రి కట్నంగా బైక్ ఇవ్వకపోవడంపై భర్త, అత్తమామలు, మరిది వేధించడంతోపాటు చిత్రహింసలకు గురి చేసినట్లు ఆరోపించింది. మామ, మరిది తన పట్ల అసభ్యంగా ప్రవర్తించగా అడ్డుచెప్పడంతో దారుణంగా కొట్టారని ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# నీట్ చరిత్రలో ముగ్గురికి మించి టాపర్లు లేరు

- అసాధారణ రీతిలో 67 మంది టాపర్లు
- నీట్ పేపర్ అవకతవకలపై విచారణ కమిటీ..?
- కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం

**ముందడుగు జాతీయం**

నీట్ యూజీ పరీక్షలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. యూపీఎస్సీ మాజీ చైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని వేయాలని నిర్ణయించింది. ఈ కమిటీ వారం రోజుల్లో సిఫారసులతో కూడిన నివేదిక ఇస్తుందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే) డీజీ సుబోధ్‌కుమార్ సింగ్ వెల్లడించారు. 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కుల్ని కమిటీ సమీక్షిస్తుందని.. ఆ తర్వాత ఫలితాలను సవరించే అవకాశం ఉందని తెలిపారు.

నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ఎన్టీయే డీజీ సుబోధ్‌కుమార్ ఖండించారు. పేపర్ లీక్ కాలేదని.. ఎలాంటి అవకతవకలు జరగలేవని స్పష్టంచేశారు. NCERT పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్షా కేంద్రాల వద్ద సమయం కోల్పోవడంతో ఇచ్చిన గ్రేస్ మార్కుల వల్లే పలువురు విద్యార్థులు అధికంగా మార్కులు సాధించడానికి కారణాలని వివరించారు. అందుకే 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కుల్ని కమిటీ సమీక్షిస్తుందని.. ఆ తర్వాత ఫలితాలను సవరించే అవకాశం ఉందని తెలిపారు.

2019 నుంచి ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మందికి 720కి 720 మార్కులు రావడం, టాపర్లుగా నిలవడంతో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు మొదలయ్యాయి. ఇప్పటివరకు నీట్ యూజీలో ఒక్కసారి కూడా ముగ్గురికి మించి టాపర్లు లేరు. 2019, 2020లో ఒక్కొక్కరు చొప్పున టాపర్లుగా నిలిచారు.




2021లో ముగ్గురు, 2022లో ఒక్కరు, 2023లో ఇద్దరు టాప్ స్కోరు సాధించారు. కానీ, ఈసారి అసాధారణ రీతిలో 67 మంది టాపర్లుగా నిలవడం, వీరిలో హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు ఉన్నారనే వార్తలు రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు మొదలయ్యాయి.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## 1996-2001 బ్యాచ్ విద్యార్థుల వేడుక

**ముందడుగు హైదరాబాద్:**

ఒక దగ్గరే కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల 19962001 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 73 మంది ఉండగా అందులో 10 మంది వరకు ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారు. వారిలో ఒకరు బంధం ఉపేంద్రారావు పోలీస్ శాఖలో ఎస్సైగా ఎంపికై సీఐగా ప్రమోషన్ పొంది ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా నందు డోర్నకల్ పోలీస్ స్టేషన్ సిఐగా పనిచేస్తున్నారు. మరి కొంతమంది ఉపాధ్యాయులుగా, సాఫ్ట్ వేర్ ఇతర ప్రైవేట్ రంగాలలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరు అందరూ సుమారు 23 ఏళ్ల తరువాత తాము చదువుకున్న



పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ద్వారా తమ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అదేవిధంగా భవిష్యత్ కార్యక్రమాలకు ప్రణాళికలు వేసుకున్నారు. స్కూల్ పిల్లల అవసరాలు నిమిత్తం పాఠశాల కోసం ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్ లో కూడా తాము చదువుకున్న పాఠశాల కోసం ఏదైనా చేయాలి అని నిర్ణయం తీసుకున్నారు.

# ప్రతిరోజూ 30 నిమిషాలు డ్యాన్స్ చాలు

## దీంతో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ● అనేక తీవ్రమైన వ్యాధుల నివారణ



**ముందడుగు ప్రత్యేకం:**

**ప్రస్తుత రోజుల్లో మనిషి శరీరానికి శ్రమ అనేది లేకుండా పోతుంది. సరియైన శారీరక శ్రమ లేకుంటే మనిషికి అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. శారీరక శ్రమ లేని జీవనశైలి మీ బరువును పెంచుతుంది, మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇంట్లో కూర్చొని ఎలా ఆరోగ్యంగా ఉండాలి అని చాలామంది ఇంటర్నెట్ లో కూడా వెతుకుతుంటారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రతిరోజూ డ్యాన్స్ చేయడం అద్భుతమైన వ్యాయామం. ఇది ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలను అందిస్తుంది.**

ఓ నివేదిక ప్రకారం.. ప్రతిరోజూ 30 నిమిషాలు డ్యాన్స్ చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, అనేక తీవ్రమైన వ్యాధులను నివారించవచ్చని అనేక పరిశోధనలలో తేలిందట. డ్యాన్స్ అనేది ఒక ప్రయోజనకరమైన వ్యాయామం, ఇది మన శారీరక ఆరోగ్యంతో పాటు మన మానసిక ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. దాదాపు 30 నిమిషాల పాటు డ్యాన్స్ చేయడం వల్ల 130 నుండి 250 కేలరీలు బర్న్ అవుతాయి, దీని కారణంగా శరీరంలోని అదనపు కొవ్వు వేగంగా కరుగుతుంది. క్రమం తప్పకుండా డ్యాన్స్ చేయడం ఊబకాయంతో బాధపడేవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది కొవ్వును తగ్గించడంలో వారికి సహాయపడుతుంది.

### గుండె ఆరోగ్యానికి మేలు

రోజూ డ్యాన్స్ చేయడం ఫిట్‌నెస్‌ను మెరుగుపరచడమే కాకుండా గుండె ఆరోగ్యాన్ని కూడా పెంచుతుంది. ఇది శరీరం సమతుల్యత, సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది. అయితే ఇది మీరు ఎలాంటి డ్యాన్స్ చేస్తున్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది. కొన్ని ఫాస్ట్ మూవింగ్ డ్యాన్స్ అయితే, కొన్ని స్లో డాన్సులు. రెండు పరిస్థితులలో మీ శరీరం, మనస్సు రెండూ పాల్గొంటాయి. డ్యాన్స్ అనేది పూర్తి శరీర వ్యాయామం, ఇది మిమ్మల్ని శారీరకంగా, మానసికంగా మెరుగ్గా చేస్తుంది.

### శరీర బలం పెరుగుతుంది

పరిశోధకుల అభిప్రాయం ప్రకారం.. డ్యాన్స్ మన శరీరంలోని కండరాలను కదిలిస్తుంది. డ్యాన్స్ చేసేటప్పుడు మీ కాళ్ళను కదిలించడం చాలా ముఖ్యం. ఇది మీ దిగువ శరీరానికి చాలా ప్రయోజనాలను కలిగి ఉంటుంది. క్రమం తప్పకుండా డ్యాన్స్ చేయడం మీ శరీర బలాన్ని పెంచుతుంది. మధుమేహం లేదా అధిక రక్తపోటుతో బాధపడుతున్న వారికి డ్యాన్స్ ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రతిరోజూ డ్యాన్స్ చేయడం వల్ల అధిక కొలెస్ట్రాల్, అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, ఊబకాయం వంటి అనేక తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

# చిన్నారుల కోసం బాల్ జీవన్ బీమా

## రోజుకు రూ. 6 లేదా రూ.18 పొదుపు చేయాలి ● మెచ్యూరిటీ సమయానికి రూ. 6 లక్షలు

**ముందడుగు ప్రత్యేకం:**

ఇంట్లో చిన్నారుల కోసం ఎంతో, కొంత పొదుపు చేస్తూ ఉండాలి. పిల్లలు పెద్దగా అవుతుంటే సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలని చాలా మంది భావిస్తున్నారు. భవిష్యత్తులో పెరిగే ఖర్చులు, అవసరాల దృష్ట్యా సేవింగ్స్ అనివార్యమనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ నమ్ముతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఎన్నో రకాల సేవింగ్స్ స్కీమ్‌స్‌ను ప్రవేశపెడుతుండడంతో చాలా మంది వీటికి ఆకర్షితులవుతున్నారు. అయితే దాదాపు అన్ని రకాల సేవింగ్స్ స్కీమ్స్ పెద్దలకు సంబంధించినవే ఉంటాయి. కానీ ప్రముఖ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ పోస్టాఫీస్ చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఓ పథకానికి శ్రీకారం చుట్టింది. బాల్ జీన్ బీమా పథకంతో తీసుకొచ్చిన ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

### చిన్నారులకు ప్రత్యేకం

ఇండియన్ పోస్టాఫీస్ అందిస్తోన్న ఈ పథకంలో రోజుకు రూ. 6 లేదా రూ. 18 చొప్పున పొదుపు చేసుకోవచ్చు. రోజుకు రూ. 6 చొప్పున పెట్టుబడి పెట్టుకుంటూ పోతే మెచ్యూరిటీ సమయానికి రూ. లక్ష రాబడి పొందొచ్చు, అదే మీరు రోజు రూ. 18 చొప్పున పొదుపు చేస్తే రూ. 3 లక్షలను పొందొచ్చు. ఈ పథకం కేవలం చిన్నారుల కోసమే ప్రత్యేకంగా తీసుకొచ్చారు. ఇందులో చేరాలంటే 5 ఏళ్ల నుంచి 20 ఏళ్ల లోపు ఉండాలి. వీరి పేరెంట్స్ ఇందులో పెట్టుబడి పెట్టొచ్చు. ఇక తల్లిదండ్రుల వయసు 45 ఏళ్లు మించకూడదు.

### పిల్లలకు పూర్తి మెచ్యూరిటీ

ఒక కుటుంబంలో గరిష్టంగా ఇద్దరు పిల్లలకు మాత్రమే ఈ పథకంలో చేరే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు మీకు ఇద్దరు పిల్లలు ఉంటే రోజుకు రూ. 36 చొప్పున పొదుపు చేసుకుంటూ పోతే మెచ్యూరిటీ సమయానికి రూ. 6 లక్షల వరకు పొందొచ్చు. ఒకవేళ పాలసీ మెచ్యూరిటీకి ముందే పాలసీదారు మరణిస్తే.. ఆ టైమ్లో ఇకపై పాలసీ ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదు. పాలసీ గడువు ముగిశాక పిల్లలకు పూర్తి మెచ్యూరిటీ మొత్తం చెల్లిస్తారు. పాలసీ ప్రీమియాన్ని పేరెంట్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఇక పాలసీ నుంచి మధ్యలో వైదొ



గాలనుకుంటే ఐదేళ్ల తర్వాత సరెండర్ చేసే అవకాశం ఉంది. ఇక ఈ పథకంలో పెట్టిన పెట్టుబడికి రూ. 1000 ప్రతి సంవత్సరం హామీ మొత్తం మీద రూ. 48 బోనస్ ఇస్తారు. ఈ పథకంలో చేరాలనుకునే వారు దగ్గరల్లోని పోస్టాఫీస్‌ను సంప్రదించాల్సి ఉంటుంది.